# సహాయం

—వసుంధర

కలిగిన వాడిననీ, దయాగుణ మున్నవాడిననీ నాకు కాస్త గర్వం. అలాగని నేను మరీ అంత గొప్ప వాడినీ కాను, దానకర్ణుణ్ణీ కాను. గవర్నమెంటు ఆఫీసరుగా నాలుగంకెల జీతం సంపాదించుకుంటున్నాను. భార్య, ఇద్దరు బిడ్డలు. ఇతరత్రా బాధ్యతలు లేవు. దురలవాట్లూ, దుబారా అలవాట్లూ లేవు. ఉన్నంతలో నాకంటే లేనివారికి సాయపడుతూంటాను.

అప్పులివ్వడం నాకు ఇష్టముండదు. అవి మిత్రుల మధ్య భేదాభిప్రాయాలను సృష్టిస్తాయని నా భయం. ఆ విషయంలో నిర్మొహమాటంగా ఉండడం వల్లనే అది నిష్ఠూరమైనప్పటికీ, చాలామందితో నా స్నేహం నిలబడింది. మరి నా దయాగుణం ఎక్కడ కనబడుతుంది?.... లేనివాళ్ళకి చిన్న మొత్తాలు సాయం చెయ్యడంలో!

నా పిల్లల బట్టలు స్టీలు సామాను వాళ్ళకు కాక పసిపిల్లల కిప్పిస్తాను. నా పిల్లల పుస్తకాలు ఆ క్లాసు అయిపోగానే చదువుకునే పేద పిల్లల కిప్పిస్తాను. ఇలా కాకుండా పేద విద్యార్థులకు ఫీజులు కట్టడమూ, భోజనాలు పెట్టడమూ, బట్టలు కుట్టించడమూ వగైరాలు చాలాసార్లు చేశాను. అలా చేయడంవల్ల నాకు చాలా తృప్తిగా ఉండేది.

మా పక్కింట్లో పరంధామయ్యగారు ఉన్నారు. ఆయన సామాన్య గుమాస్తా. ముగ్గురమ్మాయిలూ, ఇద్దరబ్బాయిలూ ఆయనకు. పేదరికం కొట్టవచ్చినట్లు కనబడుతూంది ఆయన ఇంట్లో. ఆయన పరిస్థితులు తెలిసి ఆయనకు సాయపడాలని ఉండేది నాకు. అయితే, ఆయన నన్నెన్నడూ సహాయం అడగలేదు. నన్నే కాదు; చుట్టుపక్కల ఎవరినీ కూడా ఆయన సహాయం అడగలేదు. ఉన్నంతలో ఎలాగో సంసారం నెట్టుకొస్తున్నాడాయన.

పరంధామయ్య గారింటికి తరచుగా అప్పులవాళ్ళు వచ్చి వెడుతూంటారు. ఆ అప్పుల వాళ్ళ కంఠాలు చాలా పెద్దవి. వచ్చి నానా గొడవా చేసి వెడుతూంటారు. పరంధామయ్య వాళ్ళకు మంచి మాటలు చెప్పి పంపిస్తూ ఉంటాడు. ఆ అప్పులవాళ్ళ మాట విన్నప్పుడల్లా నాకెంతో బాధ కలిగేది. ఆయన అప్పులన్నీ కలిపితే మూడు నాలుగు వేలకు మించవు. ఆ మాత్రానికి నేను సాయపడగలను. ఆ అప్పులకు వడ్డీలు పెరుగుతూండటం వల్ల ఆయన జీవితం ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది. ఆ అప్పులు తీరిపోతే ఆయన జీవితం కొంత సాఫీగా వెళ్ళిపోతుంది. కాని, ఆయన ఒక్క పర్యాయం కూడా తన దీనావస్థ నాకు చెప్పుకోలేదు. ఎలా సాయపడేది?

ఒక రోజున పరంధామయ్య గారబ్బాయి రవి నా దగ్గరకు వచ్చాడు. అతడికి పద్దెనిమిదేళ్ళు. బియ్యే చదువుతున్నాడు. పరంధామయ్యగారి ఆశలన్నీ అతడిపైనే ఉన్నాయి.

"ఏమిటిలా వచ్చావ్?"

"పరీక్ష ఫీజు కట్టడాని కీవేళే ఆఖరు రోజండీ. నాన్నగారెంత ప్రయత్నించినా దొరకలేదు. మిమ్మల్నడుగుతానంటే వద్దన్నారు. ఆయనకు తెలియకుండా నేనే మీ దగ్గరకు వచ్చాను....." అన్నాడు రవి.

నా హృదయం కరిగి పోయింది. పరంధామయ్యగారికి ఎంత అభిమానం? ఇరుగు పొరుగులతో సరిసమానంగా ఉండడం కోసం ఆయన తీసుకుంటున్న శ్రద్ధ, మెచ్చుకో తగ్గదే! కానీ కుర్రాడి భవిష్యత్తు మాటేమిటి?

నేను వెంటనే అతనికి డబ్బు ఇచ్చి, "మీ నాన్నగారికి చెప్పక్కర్లేదు. నువ్వీ డబ్బు నాకు తిరిగివ్వక్కర్లేదు. ఏదో భగవంతుడు నా కింత ఇచ్చాడు. సమయానికీ డబ్బు నీ కుపయోగిస్తే అదే చాలు" అన్నాను.

రవి కళ్ళలో కృతజ్ఞతాభావం స్పష్టంగా కనబడింది. డబ్బు తీసుకుని అతను వెళ్ళిపోయాడు.

తరవాత రెండు మూడు వారాలకు రవి డబ్బు తీసుకుని నా దగ్గరకు వచ్చాడు. నేను ఆశ్చర్యపోయాను. అతనెంత చెప్పినా డబ్బు తీసుకో లేదు.

"చూడు, రవీ! అప్పు లివ్వడమంటే నాకు పరమ అసహ్యం. అప్పుగా అడిగానని తెలిస్తే నేను నీ కసలు డబ్బు ఇచ్చి ఉండేవాణ్ణి కాదు. బుద్ధిగా చదువుకుంటున్న కుర్రాడికి ప్రభుత్వం ఇచ్చిన స్కాలర్‌షిప్పుగా భావించి ఆ డబ్బు సంగతి మరిచిపో. నీ దగ్గర ఆ డబ్బు తీసుకుంటే నాకు నిద్ర పట్టదు."


నే నా డబ్బు తీసుకోకపోతే, అవి పరంధామయ్యగారికి మరో విధంగా ఉపయోగ పడుతుందని నా ఆశ.

ఏమనుకున్నాడో కానీ, రవి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. నాకు చాలా సంతోషంగా ఉంది, ఇన్నాళ్ళకు ఏదో విధంగా ఉడతా భక్తిగానైనా పరంధామయ్యగారి కుటుంబానికి సాయ పడగలిగానని.

## పక్షి ప్రణయం!

—ఎల్.ఆర్.గ్రోవర్






పది రోజులయ్యాక మా వీథిలోనే ఉంటున్న నా స్నేహితుడు మూర్తి నన్ను రెండు వందలు అప్పు అడిగాడు.

''నేను అప్పు లివ్వనని తెలుసు ననుకుంటాను!'' అన్నాను.

''అవుననుకో! కాని ఇది నా కోసంకాదు. ఎప్పుడూ అడగని వాళ్ళు అడిగేసరికి లేదన లేకపోయాను. నా దగ్గర డబ్బు లేదు. నువ్వు సర్దగలవేమోనని.''

''ఇస్తానులే కాని, ఎవరేమిటి ని న్నడిగింది?'' అన్నాను.

''పరంధామయ్యగా రబ్బాయి రవి'' అన్నాడు మూర్తి.

ఆశ్చర్యపోయాను. ''ఎందుకుట?'' అనడిగాను.

''అతడి అక్కయ్యకు పెళ్ళి చూపులట.''

నేను మారు మాట్లాడకుండా మూర్తికి రెండు వందలూ ఇచ్చేసి, ఆ రాత్రి రవిని మా ఇంటికి రమ్మని కబురు పెట్టాను. అతను వచ్చాడు.

''నీకు డబ్బు అవసరమైతే నన్ను అడగవచ్చుగా. మూర్తి నెందు కడిగావు?'' అనడిగాను సూటిగా.

రవి ముఖం అదోలా అయిపోయింది.

''నా కెలా తెలిసిం దనుకుంటున్నావా? ఆ డబ్బు మూర్తి నా దగ్గరే తీసుకుని నీ కిచ్చాడు'' అన్నాను.

రవి గొంతు సవరించుకుని—''మీ కాడ డబ్బు మూర్తిగారు మళ్ళీ ఇచ్చేస్తే పుచ్చుకుంటారా?'' అన్నాడు.

''ఎందుకు పుచ్చుకోను?''

''అప్పు లివ్వటం పరమ అసహ్యమని నాతో అన్నారు మీరు. కాని, మూర్తిగారికి అప్పిస్తారు—ఎందుకని?''

ఏదో చెప్పబోయి ఆగిపోయాను. మూర్తికీ, పరంధామయ్యగారికీ ఉన్న తేడా అందరికీ తెలిసిందే! కాని, అది నా నోటితో ఎలా చెప్పేది?

''మా బోటి గాళ్ళు అప్పడిగితే మళ్ళీ తీసుకోరు మీరు. అంటే మమ్మల్ని యాచకుల కింద లెక్క కట్టినట్లే కదా? ఎన్ని మాటలైనా సహిస్తారు. అవమానాలైనా భరిస్తారు. కాని, నాన్నగారు ఊహలో కూడా యాచనను సహించలేరు, భరించ లేరు'' అన్నాడు రవి.

పరంధామయ్యగారి వ్యక్తిత్వంతోపాటు సహాయానికి అర్థంకూడా నాకు తెలిసింది. పరస్పరం చేసుకో గలిగినదే సహాయ మవుతుంది. ఒకడు ఇచ్చేవాడూ, రెండో వాడు పుచ్చుకునే వాడూ అయితే ఇవ్వబడినది సహాయం కాదు. దానం లేక ముష్టి. పరంధామయ్య గారిలువంటి దానికి సిద్ధపడి లేరు.

పది రోజుల తరవాత వడ్డీ లేని పద్ధతిని ప్రామిసరీ నోటు ఉంచుకుని పరంధామయ్యగారికి నాలుగు వేల రూపాయలు అప్పుగా ఇచ్చాను. ఆయన నా అప్పును తీసుకోవడమే కాక నెల నెలా కొంత చెల్లు వేస్తున్నాడుకూడా.

సహాయం పేరుతో ఇతరుల అభిమానాన్ని దెబ్బ తీస్తున్నానన్న విషయం ఇప్పుడే గ్రహించినప్పటికీ— ఇప్పటికీ నా సహాయం నాకు నిజమైన తృప్తి నిస్తోంది.

★